## క్లుప్తంగా

### నవోదయకు విద్యార్థి ఎంపిక



రిత్విక్

**కాళేశ్వరం:** మహదేవపూర్ మండల కేంద్రంలోని గుడ్‌మార్నింగ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థి గోల్కొండ రిత్విక్ నవోదయ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి ఆరవ తరగతి ప్రవేశానికి ఎంపికయ్యాడు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను విద్యార్థిని బుధవారం అభినందించారు.

### విద్యార్థులకు సన్మానం




**మల్హర్:** మండలంలోని కొయ్యూరులోని విశ్వదీప్తి పాఠశాలకు చెందిన విద్యార్థులు శరణ్య, సాయిమణిదీపిక ఇటీవల విడుదలైన నవోదయ ఫలితాల్లో ఉత్తీర్ణత పొంది, సీట్లు సాధించారు. వారిని ప్రిన్సిపాల్ సుదర్శన్, వైస్ ప్రిన్స్‌పాల్ మెర్సీ వర్గీస్, ఉపాధ్యాయ బృందం జ్ఞాపికలు అందజేసి, అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### వినోద్‌కుమార్ శుక్లాకి అవార్డుపై హర్షం

**టేకుమట్ల:** హిందీ రచయిత, కవి, వ్యాసకర్త వినోద్‌కుమార్ శుక్లా జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపిక కావడం హర్షనీయమని తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వినోద్‌కుమార్ శుక్లా అత్యున్నత పురస్కారాన్ని అందుకుని ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.


### సమస్యలు పరిష్కరించాలి

**భూపాలపల్లి రూరల్:** పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. జిల్లా బీసీ సంఘం నాయకుడు భీమనాథుని సత్యనారాయణ బుధవారం భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందించారు. సత్యనారాయణ మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు మంచినీటి కొరత ఉందని, సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలు లేని వార్డుల్లో నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కోరారు. అదేవిధంగా అంబేడ్కర్ సెంటర్ నుంచి ఓసీ టు వరకు రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయని, తిరిగి చేపట్టి పూర్తి చేయాలని కోరారు. వేసవి నేపథ్యంలో పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహర్తి తీర్చాలని కోరారు.

### చీటింగ్ కేసు నమోదు

**రేగొండ:** గతంలో భాగిర్థిపేట బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా విధులు నిర్వహించిన గోపాల్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భాగిర్థిపేట గ్రామంలో గతంలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా విధులు నిర్వహించిన గుగులోతు గోపాల్ ప్రభుత్వ అనుమతి లేకుండా తన సొంత అవసరాలకు రూ.99 వేలు వినియోగించినట్లు ఆడిట్‌లో వెల్లడైంది. కాగా నిధుల దుర్వినియోగానికి పాల్పడిన గోపాల్‌పై కేసు నమోదు చేయాలని భూపాలపల్లి సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గోపాల్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### ముందస్తు అరెస్ట్



**చిట్యాల:** మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న పడిదల దేవేందర్‌ను పోలీసులు బుధవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. సెక్యూరిటీ గార్డుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగే మహాసభకు వెళ్లకుండా అరెస్ట్ చేసినట్లు ఏఎస్సై సమ్మిరెడ్డి తెలిపారు.

### అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు



**టేకుమట్ల:** మండలంలోని రామకిష్టాపూర్(టి) శివారులో మంగళవారం సాయంత్రం జరిగిన లారీ ప్రమాదంలో ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందిన సంఘటన విదితమే. బుధవారం పోస్ట్‌మార్టం అనంతరం సంధ్య, పూలమ్మల అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు పాలాల సర్వోత్తంరెడ్డి, గునిగంటి మహేందర్, సంగి రవి, అచ్చె సంతు, తదితరులు పాల్గొన్నారు. బాధిత కుటుంబాలను ఓదార్చి, భరోసా కల్పించారు.

# వ్యవసాయ కూలీలకు డిమాండ్

- ఆడ, మగ వరి పువ్వు దులపడం మరూ..
- ముమ్మరంగా మొక్కజొన్న కోతలు
- తగ్గిన వ్యవసాయ కూలీల సంఖ్య



మొక్కజొన్న పంటను కోస్తున్న కూలీలు

**టేకుమట్ల:** సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత కాలంలో వ్యవసాయ పనులు చేసే వారి సంఖ్య చాలావరకు తగ్గిపోయింది. దీంతో వ్యవసాయ పనులు చేస్తున్న కొద్దిమందికి డిమాండ్ పెరిగింది. పత్తి, మిర్చి పంటలు గత నెలలోనే పూర్తవగా యాసంగిలో రైతులు ఎక్కువగా వరి, మొక్కజొన్న పంటలనే సాగు చేశారు. వరిలో ఎక్కువగా లాభాలు తెచ్చే ఆడ, మగతోపాటు ఈ ఏడాది రికార్డు స్థాయిలో మొక్కజొన్నలో సైతం ఆడ, మగ రకం మొక్కజొన్నను సాగు చేశారు. యాసంగి సీజన్‌లో మండలంలో 6,600 ఎకరాల్లో వరి, 3,700 ఎకరాల్లో మొక్కజొన్నను సాగు చేశారు. ఆడ, మగ వరి పువ్వు దులపడం, ఆడ, మగ మొక్కజొన్న పంట కోతకు రావడంతో దినసరి కూలీలు ఫుల్ జోష్‌లో ఉన్నారు. వరిలో సుమారు రెండు గంటల పాటు పువ్వు దులిపేందుకు ఒక్కొక్కరికి రూ.700, అలాగే మొక్కజొన్న కంకులను కోసేందుకు ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు పని చేస్తున్న కూలీలు రూ.400 డిమాండ్ చేస్తున్నారు. అంతే కాకుండా సాయంత్రం వేళలో 4గంటల నుంచి 6గంటల వరకు పని చేస్తే రూ.200 రైతులు చెల్లిస్తున్నారు. ఒక వ్యక్తి ఒక రోజులో సుమారు 6గంటలు పని చేస్తే రూ.600 చెల్లిస్తున్నారు. దిగుమతి, రాబడి ఎంత ఉన్నా కూలీల రేట్లు మాత్రం చుక్కలు చూపిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నష్టాల్లో రైతులు..**

వ్యవసాయ కూలీల రేట్లు పెంచడంతో వేలల్లో పెట్టుబడి పెట్టి సంవత్సర కాలం పాటు పంటలు పండించినదానికంటే దినసరి కూలీలే ఎక్కువ ఆదాయం పొందుతున్నారని రైతులు చెబుతున్నారు. లాభాలు ఏమోగాని.. నష్టం లేకుంటే చాలన్నట్లుగా వ్యవసాయం సాగుతుందని పేర్కొంటున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణమని వాపోతున్నారు.

**ఉదయం, సాయంత్రం వెళ్తున్నా..**



ప్రతీ రోజు ఉదయం సాయంత్రం పనికి వెళ్తున్న. ఇదివరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు చేసే వాళ్లం. మరో నెల రోజుల వరకు వ్యవసాయ పనులు ఉంటాయి. వరి, మొక్కజొన్న పంటలు పూర్తయితే ఎండా కాలమంతా ఖాళీనే.

– రేణుక, అంకుషాపూర్

**కూలీ రేట్లు పెంచారు**



రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని ఆడ, మగ మొక్కజొన్న పంటను సాగు చేశాను. కూలీ రేట్లు పెంచడంతో కంకులు తీసి, కాంటా పెట్టే వరకే ఎకరానికి సుమారు రూ.20వేల ఖర్చు అవుతుంది. కూలీ రేట్లు అందుబాటులో ఉండాలి.

–అచ్చె సంతు రైతు, రామకిష్టాపూర్(టి)

# తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- ఎంపీడీఓ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

**రేగొండ:** వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్టమైన నివారణ చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో తాగునీటి సరఫరా, ఎల్ ఆర్ఎస్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన వారు ఇందిరమ్మ ఇండ్లు సత్వరమే నిర్మించుకునేలా అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. ఉపాధి హామీ పనులకు కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రేగొండ తహసీల్దార్ శ్వేత, కొత్తపల్లిగోరి తహసీల్దార్ వీరభద్రం, మండల ప్రత్యేక అధికారి సునీల్‌కుమార్, ఎంపీఓ రాంప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు వెన్నెల, సౌజన్య, ఏపీఓ జమీర్‌పాషా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

**కాటారం:** గ్రామాల్లో సమస్యలపై సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని హౌసింగ్ పీడీ లోకిలాల్, తహసీల్దార్ నాగరాజు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పలు ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మంచినీటి సమస్య, ఉపాధిహామీ పనుల ప్రగతి, ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి, ఎల్ఆర్ఎస్ పథకం, ఇంటి పన్నుల చెల్లింపు, కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల పరిశీలన, రాజీవ్ యువ వికాస్ పథకం అమలు.. తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పీడీ, తహసీల్దార్ మాట్లాడారు. ఆయా శాఖల అధికారులు గ్రామాల్లో నిత్యం పర్యటించి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు గ్రామాల్లో పకడ్బందీగా అమలు చేయడంతోపాటు అర్హులైన వారి అందేలా చూడాలని తెలిపారు. వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా సక్రమంగా సాగేలా మిషన్ భగీరథ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ బాబు, ఎంపీఓ వీరస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా మినీ మేడారం జాతర



మొక్కులు చెల్లిస్తున్న శ్రీనివాస్, నాయకులు

**కాటారం:** మండలంలోని జాదారావుపేట గ్రామ పంచాయతీ పరిధిలో గల రఘుపల్లి శివారులోని మైలమ్మ చెలుకలోని సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద మినీ మేడారం జాతర బుధవారం ప్రారంభమైంది. 40 సంవత్సరాల క్రితం మైలమ్మ చెలుకలో సమ్మక్క, సారలమ్మ దేవతలు వెలవడంతో ప్రతి ఏటా గ్రామస్తులు జాతరను జరుపుతారు. బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ నాయకుడు గోమాసే శ్రీనివాస్ ఆధ్వర్యంలో మేడారం నుంచి వచ్చిన పూజారులు సిద్దబోయిన లక్ష్మణ్‌రావు, చందా హన్మంతరావు, ఆలయ పూజారులు పోచయ్య, లచ్చయ్య అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. మొదటి రోజు సారలమ్మను గద్దెపై నిలపగా భక్తులు మొక్కులు సమర్పించారు. నేడు(గురువారం) సమ్మక్క తల్లిని గద్దెలపై నిలిపి పూజలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్‌కుమార్, సీనియర్ నాయకులు గంట అంకయ్య, లింగయ్య, నేతకాని సంఘం యూత్ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జె రాజ్‌కుమార్, గోమాసే విక్రమ్, శ్రీకాంత్, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవమైనది

- మండల విద్యాధికారి శ్రీదేవి



భిక్షపతి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

**కాటారం:** సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనదని మండల విద్యాధికారి శ్రీదేవి అన్నారు. మండలంలోని అంకుషాపూర్ ప్రభుత్వ పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న జాలిగపు భిక్షపతి పదవి విరమణ కార్యక్రమం బుధవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ, డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు భిక్షపతి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న గౌరవం మరే వృత్తిలో లేదన్నారు. భిక్షపతి సుదీర్ఘ కాలంగా ఉపాధ్యాయుడిగా పని చేసి ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ఆయన ఉపాధ్యాయుడిగా అందించిన సేవలు ప్రతి పాఠశాలలో, ప్రతి విద్యార్థి మనసులో స్థిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. భిక్షపతి పీఆర్టీయూలో అంకితభావం గల కార్యకర్తగా పని చేస్తూ సంఘ బలోపేతానికి కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రభాకర్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి రమణారెడ్డి, పీఆర్టీయూ నాయకులు మండల తిరుపతిరెడ్డి, శ్రీహరి, మహాముత్తారం ఎంఈఓ సంజీవరెడ్డి, పీఆర్టీయూ మండల బాధ్యులు రవీందర్, తిరుపతి పాల్గొన్నారు.

# ఒకే దేశం.. ఒకే ఎన్నికపై ప్రచారం చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నిశిధర్‌రెడ్డి

**రేగొండ:** కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని అమలు చేసేందుకు బిల్లు రూపొందించిందని ఈ బిల్లు వల్ల దేశ ప్రగతికి కలిగే ప్రయోజనాలను బీజేపీ కార్యకర్తలు ప్రచారం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్‌రెడ్డి కోరారు. బుధవారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు వేర్వేరుగా జరగడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఆర్థికంగా దేశప్రగతి కుంటుపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు విష్ణు యాదవ్, రాకేష్, బాబురావు, నరేష్, వేణు, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### కల్తీ విత్తనాలతో పంటకు నష్టం

**మల్హర్:** కల్తీ విత్తనాలతో కారణంగా తన వరి పంటకు నష్టం జరిగిందని మండలం తాడిచర్లకు చెందిన రామిడి రాజయ్య అనే రైతు ఆరోపించారు. గ్రామంలోని ఓ ఎరువుల దుకాణంలో 10రకం వరి విత్తనాలు కొనుగోలు చేశానని తెలిపారు. తనకున్న రెండున్న ఎకరాల్లో సాగు చేయగా సగం పంట పొట్ట దశలో ఉండగా మరి కొంత గింజలకు వచ్చిందని తెలిపారు. పంట సాగు కోసం ఎకరాలకు రూ.20 వేలు పెట్టుబడులు ఖర్చు చేసినట్లు తెలిపారు. బెరుకులతో దిగుబడి రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

# కులవృత్తుల మనుగడను కాపాడాలి




నినాదాలు చేస్తున్న నాయీ బ్రహ్మణులు

**చిట్యాల:** మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన సెలూన్ షాపుల బంద్ విజయవంతమైందని నాయీ బ్రహ్మణ సేవా సమితి మండల అధ్యక్షుడు మేడిపెల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని మంజూనగర్‌లో కార్పొరేట్ సెలూన్‌ను ఏర్పాటు చేస్తున్నారని వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. కులవృత్తుల మనుగడను కొనసాగించాలని జిల్లా సంఘం ఆదేశాల మేరకు మండలంలో సెలూన్ షాపుల బంద్ పాటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయీ బ్రహ్మణ సంఘం నాయకులు తుమూల సంజీవ్, శైలెందర్, మాదాసు నాగరాజు, దేవేందర్, రాజ్‌కుమార్, మేడిపల్లి రమేష్, మురహరి భానుచందర్, భూపతి, సూత్రపు శివాజీ, నాగవంశీ, భాస్కర్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో 'బాయిబాట'



అధికారులతో సమస్యలపై చర్చిస్తున్న నాయకులు

**భూపాలపల్లి రూరల్:** భూపాలపల్లి కేటీకే 1 ఇంక్లైన్‌లో ఐఎన్‌టీయూసీ భూపాలపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ బేతెల్లి మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బాయిబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడారు. ముఖ్యంగా పని ముట్లు నాణ్యత లేకపోవడం, క్యాంటీన్ నిర్వహణ, సింగరేణి మాత్రమే నిర్వహించాలని, ఆర్వో వాటర్‌ను పిట్ ఆఫీస్‌కు సప్లై చేయాలనే సమస్యలను కార్మికులు నాయకులకు వివరించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని మధుకర్‌రెడ్డి కార్మికులకు హామీ ఇచ్చారు. అనంతరం గని మేనేజర్‌ను కలిసి కార్మికుల సమస్యలను వివరించారు. కార్యక్రమంలో పిట్ సెక్రటరీ సమ్మయ్య, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ భారత శ్రీనివాస్, నాయకులు అశోక్, చేరాలు, రాయమల్లు, బాలరాజు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

### పోచమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు, గ్రామస్తులు

**చిట్యాల:** మండల కేంద్రంలోని రాంనగర్, చిట్యాల, చింతలపల్లి గ్రామాల్లో పోచమ్మ బోనాల పండుగ బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకుని డప్పు చప్పుళ్లతో పోచమ్మ దేవాలయాలకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

# మహిళా చట్టాలపై అవగాహన సదస్సు



మహిళలకు అవగాహన కల్పిస్తున్న సరిత

**రేగొండ:** మహిళల హక్కులను పరిరక్షిస్తున్న పలు చట్టాలపై మండలంలోని కొడవటంచలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహం సాంఘిక దురాచారమని తెలిపారు. మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులను అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, వృద్ధులకు సంబంధించిన టోల్ ఫ్రీ నంబర్ 14567 గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ మండల ఇంచార్జ్ రాంచరణ్, కళావతి, మిషన్ శక్తి కో ఆర్డినేటర్ అనూష, మమత, సఖీ కేంద్రం ఇన్‌చార్జ్ సరిత, అంగన్‌వాడీ టీచర్లు జయప్రద, నిర్మల, అజంత తదితరులు పాల్గొన్నారు.

# అబాస్ విధానం అమలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న స్వామి

**రేగొండ:** ఉద్యోగులతో చర్చించకుండా అబాస్ విధానం అమలు చేయడం సరికాదని ఐఎన్‌టీయూసీ – 3194 యూనియన్ జిల్లా అధ్యక్షుడు స్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్ (అబాస్) పారా మెడికల్ సిబ్బందిని ఇబ్బందులకు గురిచేయడం కోసమేనని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మెడికల్ సిబ్బందిని ఎలాంటి వేధింపులకు గురి చేయకుండా ఐఎన్‌టీయూసీ–3194 యూనియన్ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రవీందర్, జాయింట్ సెక్రటరీ రామారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుధ, వైస్ ప్రెసిడెంట్ వసంత తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**కాటారం:** ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి నిరుద్యోగ యువతి యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ అడ్డూరి బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 5 వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ యువత ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రింట్, దరఖాస్తుదారుడి పాస్ ఫొటో, ధృవీకరణ పత్రాల జిరాక్స్‌లను మండల పరిషత్ కార్యాలయంలోని ప్రజాపాలన సేవా కేంద్రంలో సమర్పించాలని పేర్కొన్నారు.

# పాస్టర్ మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

**కాటారం:** పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై కాటారం సబ్ డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని పాస్టర్లు, క్రైస్తవులు బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో సంతాపం తెలిపారు. కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాటారం సబ్ డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ డేవిడ్ మార్క్ మాట్లాడుతూ.. పాస్టర్ ప్రవీణ్ మృతి క్రైస్తవులకు తీరని లోటని అన్నారు. ఆయన మరణంపై అనేక అనుమానాలు ఉన్నాయని ప్రభుత్వం ఆ దిశగా విచారణ చేపట్టాలని కోరారు. దీని వెనుక సంఘ విద్రోహ శక్తులు ఉంటే గుర్తించి శిక్షించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ పాస్టర్స్ కమిటీ సభ్యులు బన్సిలాల్, ప్రకాశ్, ఐజాక్, జీవరత్నం, దానియేలు, బ్రదర్ ప్రభుదాస్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

**ములుగు రూరల్ :** రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిపై ఉన్న బారికేడ్లను బుధవారం తొలగించారు. డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్‌రావులు రోడ్డు ప్రమాద ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఎక్కువగా ఉండే గ్రామాల్లో రోడ్ సేఫ్టీ క్లబ్‌లతోపాటు వాట్సప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ పోలీస్ అధికారి, ప్రభుత్వ ఉద్యోగి, రోడ్డుకు ఇరువైపుల ఉన్న దుకాణ యజమానులను గ్రూప్‌లో చేర్చినట్లు పేర్కొన్నారు. మండలంలోని జంగాలపల్లి జంక్షన్, పెట్రోల్ బంక్, కాశిందేవిపేట క్రాస్ వద్ద వాహనాలు యూ టర్న్ తీసుకునే క్రమంలో అవతలి వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో బారికేడ్లను తొలగించారు.

### మహాసభలకు తరలిన ప్రతినిధులు

**భూపాలపల్లి రూరల్:** ఆల్ ఇండియా కోల్ వర్కర్స్ సీఐటీయూ మహాసభలకు గురువారం ప్రతినిధులు బయల్దేరారు. ఈనెల 28 నుంచి 30 వరకు బీహార్‌లోని రాంచీలో జరగనున్న 11వ ఆలిండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ మహాసభలకు యూనియన్ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావుతోపాటు, భూపాలపల్లి నుంచి కంపేటి రాజయ్య, పలువురు సీఐటీయూ ప్రతినిధులు బుధవారం రామగుండం రైల్వే స్టేషన్ నుంచి బయల్దేరారు.

### ముస్లిం మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దాతలు

**కాళేశ్వరం:** రంజాన్ పండగ సందర్భంగా మహదేవపూర్ మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ గుడాల రమణయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి కనకలక్ష్మి, కుమారుడు మాజీ జెడ్పీటీసీ గుడాల అరుణశ్రీనివాస్ చీరలు పంపిణీ చేశారు. బుధవారం ఆయన ఇంటి వద్ద చేపట్టిన ఈ పంపిణీలో ముస్లిం మహిళలు పాల్గొని చీరలు స్వీకరించారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.